

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు, హాజరైన దరఖాస్తుదారులు



డ్రా తీసి పేరు ప్రకటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కిక్.. కొందరికే లక్!

- మద్యం దుకాణాల లాటరీలో బడాబాబులకు నిరాశే
- వందల్లో దరఖాస్తులు వేయగా.. ఒక్కటీ దక్కనివారెందరో..
- సిండికేట్ అయినా.. తప్పని నష్టం
- ఒక్కో దరఖాస్తు వేసినవారిలో కొందరిని వరించిన అదృష్టం
- 24 మంది మహిళలకు అవకాశం
- టీడీపీ, వైసీపీ శ్రేణులకే అధిక దుకాణాలు లభ్యం

శ్రీకాకుళం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియలో అదృష్టం కొందరినే వరించింది. ఒక్కో దరఖాస్తు వేసిన వారిలో.. కొంతమందికి డ్రాలో లక్ తగిలి.. దుకాణాలు దక్కాయి. మరికొందరు వందల్లో దరఖాస్తులు చేసుకోగా.. రెండు, మూడు దుకాణాలే లభించాయి. జిల్లాలో 158 వైన్‌షాపులకుగాను జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందినవారు దరఖాస్తులు వేశారు. ఏకంగా 4,671 దరఖాస్తులు అందాయి. వీటన్నింటికీ సోమవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఎక్సైజ్ అధికారులు, దరఖాస్తుదారుల మధ్య కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లాటరీ తీసి.. దుకాణాలను కేటాయించారు. ప్రక్రియ పారదర్శకంగా జరిగినప్పటికీ.. మద్యం దుకాణాల్లో లాభం బాగా వస్తుందని ఆశపడి.. వందలాది దరఖాస్తులు వేసుకున్న వారికి రెండూ.. మూడు ఇలా షాపులు దక్కాయి. దీంతో బడాబాబులు.. బడావ్యాపారులు ఖంగుతిన్నారు. కొన్నిచోట్ల ఒక్కో షాపు కోసం ఒకటి మాత్రమే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు లాటరీలో లక్ వరించింది. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. మొత్తానికి జిల్లాలో మద్యం దుకాణాలను దక్కించుకున్నవారిలో టీడీపీ, వైసీపీ అనుచరులు, వారి కుటుంబ సభ్యులే అధికంగా ఉన్నారు.

● మహిళలకు.. 24 షాపులు

జిల్లాలో అత్యధిక మద్యం దుకాణాలకు మహిళల పేరిట దరఖాస్తులు అందాయి. లాటరీలో 24 మంది మహిళలకు దుకాణాలు దక్కాయి. ఇందులో శ్రీకాకుళం నగరంలో ప్రముఖ వైద్యుడి సతీమణి ఉండటం గమనార్హం. ఈమెకు బూర్జ మండలంలో వైన్‌షాపు లభించింది.

● 'ఆరు' నంబర్‌తో గందరగోళం..

లాటరీ ప్రక్రియలోని టోకెన్లలో 'ఆరు' నంబర్‌తో గందరగోళం ఏర్పడింది. జిల్లాలో 42తోపాటు 92వ నంబర్ షాపునకు గాను 'ఆరు' నంబర్‌ను లాటరీలో చదివారు. కానీ.. తాము తీసిన నంబరు ఆరు కాదని.. తొమ్మిదని.. ఇది పొరబాటు అని అధికారులు వెల్లడించారు. దీంతో.. ముందుగా ఆరు నంబర్ అని ఆశ పడినవారు కొద్దిసేపు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల వద్దకు బృందంగా వచ్చి వాగ్వాదానికి దిగారు. పోలీసులు, ఇతర అధికారులు నచ్చజెప్పి పంపారు.

● దరఖాస్తులెన్నో.. కానీ..

● సంతబొమ్మాళి మండలానికి చెందిన టీడీపీ అనుచరులు రెండు బృందాలుగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేశారు. ఓ బృందం 134 దరఖాస్తులు వేయగా.. వారికి లాటరీలో కేవలం ఆరు దుకాణాలు మిగతా 6వ పేజీలో...



టెక్కలి: మండాపాలం కాలనీలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అభివృద్ధే ధ్యేయం

- మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు
- 'పల్లె పండగ'లో రూ.4కోట్లతో పనులకు శంకుస్థాపన

7లో

టెక్కలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లూ మౌలిక సదుపాయాల కల్పన విషయం గాలికొదిలేసింది. పల్లెల్లో కనీసస్థాయిలో అభివృద్ధి కనుమరుగైంది. రోడ్లు గోతులమయంగా మారి.. ప్రయాణికులకు నరకయాతన ఎదురైంది. మరోవైపు కాలువల దుర్గంధంతో ప్రజలు రోగాల బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'పల్లె పండగ' పేరిట రహదారులు, కాలువలు బాగు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధిలో పరుగులు పెడతామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



బాదాం పాఠశాలలో ఎండీఎంను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఇక రుచికరంగా మెనూ!

- డొక్కా సీతమ్మ భోజన పథకంలో సరికొత్త మార్పులు
- దీపావళి నుంచి అమలుకు కూటమి ప్రభుత్వం కసరత్తు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయ సేకరణ
- ఉడికించిన గుడ్డు స్థానంలో రుచిగా ఉండేందుకు ఎగ్ కర్రీ, ఫ్రై

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కుళిపోయిన కోడిగుడ్లు.. రుచిలేని రాగి జావ.. పురుగులు పట్టిన చిక్కీలు.. నీళ్లలా చారు.. ముద్దలుగా అన్నం.. ఇదీ వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే మెనూ. వాటిని తినలేక పిల్లలు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా జగన్ సర్కారు పట్టించుకోలేదు. దీంతో కొందరు విద్యార్థులు అయిష్టతతో వదిలేసేవారు. ఇంకొందరు ఇళ్ల నుంచి తెచ్చుకునేవారు. బియ్యం బాగాలేకపోవడం, కూరలు రుచిగా చేయకపోవడం, మెనూలో పదార్థాలపై ఆసక్తి లేకపోవడం ఇందుకు కారణమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మెనూ తినలేకపోతున్న విద్యార్థుల పరిస్థితిని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకంగా పేరు మార్చింది. పిల్లలు ఇష్టంగా తినాలంటే ఏంచేయాలి..? ఎలాంటి మార్పులు అవసరం? అనే అంశాలపై దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఇటీవల జిల్లాస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడి డివిజన్ల వారీగా మూడు బృందాలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కొత్త మెనూను వచ్చే దీపావళి నుంచి నుంచి అమలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

● జిల్లాలో 1,915 ప్రాథమిక పాఠశాలల్లో 45,018 విద్యార్థులు, 315 యూపీ పాఠశాలల్లో 22,569 మంది, 419 ఉన్నత పాఠశాలల్లో 79,497 మంది మొత్తం 1.79లక్షల మంది విద్యార్థులు చదువుచున్నారు. వీరికి నెలవారీ మిగతా 6వ పేజీలో...



● ఈ పొలం మెళియాపుట్టి మండలం కేరాశింగి గ్రామానికి చెందిన సవర ఆనందరావు అనే గిరిజన రైతుది. ఈ పొలంతో పాటు మరో రెండు ఎకరాల భూమి ఆయనకు ఉంది. గతంలో ఆ భూముల్లో రాళ్లు ఉండేవి. వాటిని తొలగించి సాగు భూమిగా మార్చాడు. అయితే, గ్రామ చెరువుల్లో నీరు నిల్వ చేయడానికి అవకాశం లేక గత ఐదేళ్లూ వరి సాగు చేయడానికి భయపడ్డాడు. అయితే, కూటమి ప్రభుత్వం సాగునీటికి ప్రాధాన్యత ఇస్తుండడంతో ఈ ఏడాది తన భూమిలో వరి నాట్లు వేశాడు.

రాళ్లు తొలగించి.. సిరులు పండించి..

- పోడు భూములను సాగుగా మార్చిన గిరిజనులు
- వేలాది ఎకరాల్లో వరినాట్లు వేసిన వైనం
- చెక్‌డ్యామ్‌లను విస్మరించిన గత సర్కారు
- సాగునీటికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- ఆనందంలో గిరిజన రైతులు

6లో

మెళియాపుట్టి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వరి నాట్లతో కళకళలాడుతున్న ఈ పొలాలను చూశారా! మెళియాపుట్టి మండలంలోని కొండపై ఉన్న చందనగిరి గ్రామానికి సవర కృష్ణారావు, తదితర రైతుల పొలాలు ఇవి. ఒకప్పుడు రాళ్లరప్పలతో నిండిఉన్న ఈ పొలాలు పోడు వ్యవసాయానికి మాత్రమే పనికొచ్చేవి. అయితే, ఆ రాళ్లరప్పలను తొలగించి, చదును చేసి సాగు భూములుగా మార్చారు గిరిజన రైతులు. ఈ భూముల్లో రెండు నెలల కిందట వరినాట్లు వేసి పండిస్తున్నారు.



శివారుకు అందని సాగునీరు

- నారాయణపురం కాలువ పరిధిలో ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు

8లో



అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ.. 'మీ కోసం'లో అందిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన ఫిర్యాదుదారుల నుంచి 102 అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీల పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, డీఆర్డీఏ పీడీ కిరణ్, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, డీపీవో కె.భారతీ సౌజన్య, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఉద్యానశాఖ అధికారి ప్రసాదరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమాచారం

వినియోగదారులు సహకరించాలి

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి

అరసవల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 'బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా రానున్న 5 రోజుల్లో జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాల'ని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 'ఇప్పటికే జిల్లాలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయాల్లో (శ్రీకాకుళం- **94906 10045**, టెక్కలి - **83328 43456**, పలాస -**73825 85630**, పాలకొండ - **83328 43456**) హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశాం. విద్యుత్తు సరఫరాలో లోపాలున్నా, ఎక్కడైనా స్తంభాలు, వైర్లు తెగిపడినా.. హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలి. వినియోగదారులు భద్రతా సూచనలు పాటించాలి' అని కృష్ణమూర్తి తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం హెల్ప్‌డెస్క్ నెంబరు **94906 12633**, టోల్‌ఫ్రీ నెంబరు **1912**ను సంప్రదించాలని సూచించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

హెల్త్ సెక్రటరీలను వైద్యశాఖకు బదలాయించండి

- డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా

8లో

ప్రజా ఫిర్యాదులపై చట్ట పరిధిలో చర్యలు

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

8లో

ఆమె.. ఇంటికి దీపం.. ఎందరికో ఆదర్శం. ప్రేమకు రూపం. అనురాగానికి, మమకారానికి ప్రతిరూపం. అమ్మగా... అక్కగా... భర్తకు చేదోడుగా.. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో బహుముఖ రూపం. లాలనలోనూ.... కుటుంబ బాధ్యతలోనూ... విధుల్లోనూ, శ్రమైక జీవన పోరాటంలోనూ అన్నింటా ఆమె పాత్ర ఎంతో కీలకం. మంగళవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా.. కుటుంబ బాధ్యతల్లో కీలకపాత్ర పోషిస్తున్న అతివలపై ప్రత్యేక కథనం.

● కుటుంబ బాధ్యతల్లో గ్రామీణ మహిళల కీలకపాత్ర

నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం

ఆమె.. ఆదర్శం



కొడుకును ఉన్నతంగా తీర్చిదిద్ది..



కుమారుడు యుగంధర్‌తో తల్లి సరస్వతి

ఎచ్చెర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం తోడు ఉండాల్సిన భర్త అర్థాంతరంగానే కన్నుమూశాడు. భర్త లేడన్న చేదు నిజాన్ని దిగమింగుకుని పిల్లల బాగోగుల కోసం ఆమె నడుం బిగించింది. నిరక్షరాస్యులైన ఆమె చదువుకు ఉన్న శక్తిని గుర్తించి.. ఎన్నో కష్టాలను భరిస్తూ.. కుమారుడిని ప్రయోజకుడిగా తీర్చిదిద్దింది. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల గ్రామానికి చెందిన నక్క గణేష్, సరస్వతి దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. ఎచ్చెర్ల పోలీసు క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న ఓ రైస్ మిల్లులో గణేష్ మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తూ... కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఇంతలో విధి వక్రీకరించడంతో ఆయన ప్రమాదానికి గురై అనారోగ్యానికి పాలయ్యారు. ఈ క్రమంలో 2021 నవంబరులో గణేష్ మృతి చెందారు. దీంతో కుటుంబ భారమంతా సరస్వతిపైనే పడింది. భర్త చనిపోయే సమయానికి కుమారుడు యుగంధర్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, కుమార్తె జ్యోతి 8వ తరగతి చదువుతున్నారు. అప్పటివరకు కుటుంబానికి ఆసరా ఉన్న రైస్ మిల్లు జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయింది. సొంతంగా ఈమె ఎచ్చెర్లలో పిండిమిల్లును ఏర్పాటు చేసుకుని మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగింది. కుమారుడైన యుగంధర్‌ను ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో డీ ఫార్మసీ, బీ ఫార్మసీ చదివించింది. చదువులో చురుకుగా ఉండే ఆయన ఎం.ఫార్మసీ నైపర్, కోల్‌కత్తాలో సీటు సాధించారు. ఎం ఫార్మసీ పూర్తిచేసిన యుగంధర్ 2013 జనవరిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికకావడంతో ఆ కుటుంబానికి ఊపిరివచ్చినట్టయింది. తొలుత హైదరాబాద్‌లో ఆ తర్వాత విజయనగరం, విశాఖపట్నంలో పనిచేయగా, ప్రస్తుతం టెక్కలిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా యుగంధర్ పనిచేస్తున్నారు. కుమార్తె జ్యోతిని పదో తరగతి వరకు చదివించి పెళ్లి చేశారు. భర్త చనిపోయిన తర్వాత కుంగిపోకుండా సరస్వతి అన్నీ తానై పిల్లలను చదివించి ఎంతోమంది తల్లులకు మార్గదర్శిగా నిలిచారు.

బతుకు బండి లాగిస్తూ.. భర్తకు చేదోడుగా....

రిక్షా తొక్కుతున్న ఈమె పేరు అమ్మాయమ్మ. పోలాకి మండలం మబుగాం కాలనీకు చెందిన అమ్మాయమ్మ, ఎర్రయ్య దంపతులు జీడి మామిడి తోటలను కాపుకాస్తూ.. జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తుండేవారు. ఇటీవల ఎర్రయ్య అనారోగ్యం చెందడంతో.. అమ్మాయమ్మ రిక్షా బండి మీద తోటకు వెళ్లి కట్టెలు తెచ్చి విక్రయిస్తోంది. భర్తకు చేదోడుగా బతుకు బండి ముందుకు నడుపుతోంది.

- నరసన్నపేట

ఆ రోజుల్లో.. బలమైన ఆహారం తినేవాళ్లం..



నరసన్నపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 1940 నుంచి నాకు ఎరుక. ఆరోజుల్లో బలమైన ఆహారం తీసుకునేవాళ్లం. ధాన్యాన్ని దంచిన తరువాత.. వచ్చే బియ్యాన్ని వండుకొని తినేవాళ్లం. ఇప్పుడు అంత తెల్లగా ఉండేవి కావు. కానీ.. ఆ గంజినీళ్ల కోసం ఎంతో కష్టపడేవాళ్లం. ఇక జొన్న అంబలి.. లేదా సోడి అంబలి తినేవాళ్లం. వంటల్లో వేరుశనగ, నువ్వుల నూనె మాత్రం వినియోగించేవాళ్లం. ఎన్టీఆర్ అధికారంలో వచ్చిన తరువాత పామాయిల్ అంటే ఏమిటో తెలిసింది. అంతవరకు నూనెల వినియోగం తక్కువ. బంధువులు వస్తే.. కట్టెలపొయ్యిపై పప్పు అన్నం లేదా ఎండుచేపలు కూర, అప్పుడప్పుడు బాతు లేదా కోడిగుడ్డు వండేవాళ్లం. పండగలకే మాంసం కూర. ఉన్నత కుటుంబాల వారింట్లో అయితే పిండివంటలు చేసేవాళ్లు. రోజుకు ఐదుసార్లు తినేవాళ్లం. మా చిన్ననాటి రోజుల్లో ఆడపిల్లలను చదివించేవారు కాదు. ఇంటిపని అంతా.. మేమే చేసేవాళ్లం. వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లం. బాల్యం సరదాగా పనిచేస్తూ గడిపేవాళ్లం. ఇప్పుడుమాదిరి.. సెల్‌ఫోన్లు, రేడియో, టీవీలు లేవు.

-వెలమల నీలమ్మ (102), జమ్ము, నరసన్నపేట



లాటరీని ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పక్కన ఆర్డీఓ సాయిప్రత్యూష

కిక్.. కొందరికే లక్!

(5వ పేజీ తరువాయి) దక్కాయి. ఇందులో టీడీపీకి చెందిన ఎంపీటీసీతోపాటు ఇతర అనుచరులు ఉన్నారు. అలాగే మరో బృందం 61 దరఖాస్తులను వేయగా వారికి 3 దుకాణాలు లభించాయి.

● శ్రీకాకుళం నగరానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు ఏకంగా 40 దుకాణాలకు దరఖాస్తు చేయగా.. ఆయనకు ఒక్కటీ కూడా లభించలేదు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ వ్యాపారి 30 దరఖాస్తులు వేయగా ఆయనకు ఐదు దుకాణాలు లభించాయి.

● ఒడిశా రాష్ట్రం పర్లాఖిముడి ప్రాంతానికి చెందిన సిండికేట్ వాళ్లు... 100 దుకాణాలకు దరఖాస్తులు వేయగా.. వారికి పాతపట్నంలో ఒకటి, కొత్తూరులో ఒక దుకాణం చొప్పున దక్కాయి.

● టెక్కలిలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు మూడు దరఖాస్తులు వేయగా.. ఆయనకు రెండు దుకాణాలు లభించాయి. నరసన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి చెందిన అనుచరులకు, వారి కుటుంబ సభ్యులకు ఐదు దుకాణాలు దక్కాయి. శ్రీకాకుళంలో వైసీపీకి చెందినవారు.. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు అనుచరులకు దుకాణాలు లభించాయి. ఇతర నియోజకవర్గాల్లో టీడీపీ మాజీ ఎంపీపీలు, ప్రజాప్రతినిదులకు షాపులు దక్కాయి.

● పలాసలో టీడీపీ నాయకుడు 40 దుకాణాలకు దరఖాస్తు చేయగా.. ఆయనకు ఐదు లభించాయి. పలాస నియోజకవర్గంలో వైసీపీ నాయకుడికి ఒకటి, టీడీపీ నాయకులకు 8 దుకాణాలు దక్కాయి.

● ఎచ్చెర్ల మండలానికి చెందిన ఓ వ్యక్తి ఒక దరఖాస్తు వేయగా.. లాటరీలో షాపు దక్కింది. కానీ వందలు దరఖాస్తులు వేసినా ఒక్కటీ లభించనివారు రూ.కోట్లల్లో డబ్బును నష్టపోయి ఖంగుతిన్నారు. గతంలో మద్యం వ్యాపారం నిర్వహించినవారు.. బడాబాబులు.. బడా వ్యాపారులు సిండికేట్‌గా మారి వందలాది దరఖాస్తులను వేశారు. కానీ వారు ఆశించినట్లుగా షాపులు లభించలేదు. పర్లాఖిముడి ప్రాంతానికి చెందిన మరో సిండికేట్ వారు వేసిన దరఖాస్తులకు ఒకటీ లభించలేదు. పాతపట్నం నియోజకవర్గానికి చెందిన అధికారపార్టీ బృందం అధిక దరఖాస్తులను వేస్తే.. వారికి వచ్చిన దుకాణాలు మూడు మాత్రమే. మద్యం దుకాణాలు చేజిక్కితే రూ.కోట్లు సంపాదించుకోవచ్చని ఆశగా దరఖాస్తు చేసుకున్నవారిలో ఖంగుతిన్నవారే అధికంగా ఉన్నారు.

● అంతా పారదర్శకంగా...

అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియను ముందుగా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నిర్వహించారు. శ్రీకాకుళం ఆర్డీఓ లాటరీ తీశారు. అలాగే జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ తిరుపతినాయుడు, సీఐ గోపాలకృష్ణల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. భారీస్థాయిలో పోలీసు బలగాలు బందోబస్తుగా ఉన్నాయి. అలాగే దుకాణాలను లాటరీ ప్రక్రియలో దక్కించుకున్నవారిలో రాజకీయపార్టీలకు చెందినవారు ఎంతమంది ఉన్నారన్నదీ.. ఇటు స్పెషల్ బ్రాంచ్, అటు ఇంటలిజెన్స్ విభాగాలు కూడా సేకరించాయి.



మహిళల వద్ద ఎంట్రీపాస్‌లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రాళ్లు తొలగించి.. సిరులు పండించి..

● పోడు భూములను సాగుగా మార్చిన గిరిజనులు
● వేలాది ఎకరాల్లో వరినాట్లు వేసిన వైనం
● చెక్‌డ్యామ్‌లను విస్మరించిన గత సర్కారు
● సాగునీటికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
● ఆనందంలో గిరిజన రైతులు



గత ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని కేరాశింగి చెక్‌డ్యామ్



గూడలో రాళ్ల మధ్య నీటిని నిల్వ చేసిన గిరిజనులు

మెళియాపుట్టి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)

మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గూడ, చందనగిరి, అడ్డివాడ, దబ్బగూడ, తదితర గిరిజన గ్రామాలు ఎత్తయిన కొండలపై ఉన్నాయి. ఈ గ్రామాల్లోని రైతులంతా ఒకప్పుడు పోడు వ్యవసాయం చేసేవారు. రాళ్లతో నిండిపోయిన పొలాల్లో జీడిమామిడి, గంటెలు, జొన్నలు, రాగులు, తదితర పంటలను పండించేవారు. ఈ పంటలు అంతగా కలసి వచ్చేవి కావు. పైగా అటవీ ఉత్పత్తులకు పెద్దగా గిట్టుబాటు ఉండేది కాదు. దీనివల్ల వారు ఆర్థిక కష్టాలు ఎదుర్కొనేవారు. కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో పోడు వ్యవసాయాన్ని నమ్ముకుంటే ఫలితం లేదని, సాధారణ పంటలను సాగు చేస్తేనే తమ కష్టాలు తీరుతాయని భావించారు. దీనికోసం కొంతమంది గిరిజన రైతులు పోడు భూములను సాగు భూములుగా మార్చారు. యంత్రాలు కొండలపైకి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో గునపాలు వినియోగించి మనుషుల ద్వారా పొలాల్లోని రాళ్లను తొలగించారు. అనంతరం చదును చేసి వ్యవసాయ భూములుగా మార్చారు. పొలాలను దున్నేందుకు ఎద్దులు లేకపోవడంతో పదునైన పారలు వినియోగించి మట్టిని తవ్వి దమ్ము మాదిరిగా చేసి వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది మెళియాపుట్టి మండలంలోని ఒక్క కేరాశింగి గ్రామంలోనే 54 మంది రైతులు 70 ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొండలపై ఉన్న గ్రామాల్లో మొత్తం 5 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

నిధులు నిలిపివేసిన గత సర్కారు..

జిల్లాలోని మెళియాపుట్టి, మందస, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం మండలాల్లో గిరిజన గ్రామాలు ఉన్నాయి. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరయ్యేవి. గిరిజన రైతులకు కూడా వివిధ రాయితీలు అందించేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన గిరిజన అభివృద్ధి ఆగిపోయింది. ఐటీడీఏకు నిధులు నిలుపుదల చేయడంతో పాటు గిరిజన రైతాంగానికి ఎలాంటి పథకాలు మంజూరు చేయలేదు. గత ఐదేళ్లు చెరువులతో పాటు కొండలపై నీటిని అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చెక్‌డ్యామ్‌లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయలేదు. అలాగే, దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు కూడా రూపాయి విదల్చలేదు. దీంతో సాగు నీరు అందక గిరిజన రైతులు వరి సాగు చేయడం మానేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఏడాది వరి సాగుకు శ్రీకారం చుట్టారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉపాధి నిధులను వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేసున్నారు. దీనివల్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తయి సాగు నీటి కష్టాలు తీరుతాయని ఆశభావంతో ఉన్నారు.

గతంలో వరి నాట్లు వేయలేదు..



గత ఐదేళ్లు మా గ్రామ పరిధిలో ఉన్న చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చెరువుల్లో నీరు నిల్వకు అవకాశం ఉండేది కాదు. దీనివల్ల వరికి బదులు జొన్నలు పండించేవాళ్లం. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సాగు నీటిపై ఆశలు కనిపిస్తున్నాయి. అందుకే ఈ ఏడాది వరి నాట్లు వేశాం.

-సవర ఆనంద్, కేరాశింగి, మెళియాపుట్టి

పోడు వ్యవసాయం చేసేవాళ్లం..



గతంలో మా పొలాల్లో రాళ్లు ఉండడంతో వరి సాగు చేయడానికి అవకాశం ఉండేది కాదు. దీంతో పోడు వ్యవసాయం చేసేవాళ్లం. జీడితో పాటు గంటెలు, జొన్నలు, రాగులు పండించేవాళ్లం. ప్రస్తుతం మా పొలాలను సాగు భూములుగా మార్చి వరిని సాగు చేస్తున్నాం.

-సవర రామయ్య, కేరాశింగి, మెళియాపుట్టి

దిగుబడులు వస్తున్నాయి..

కొండలపై ఉన్న భూముల్లో వరి సాగు పెరుగుతోంది. కొండ రేగడి నేలలు కావడంతో దిగుబడులు బాగా వస్తున్నాయి. వరి సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ భూముల్లో యంత్రాలు వినియోగించుకోవటానికి అవకాశం లేదు. రాయితీల ద్వారా గిరిజనులకు చేయూతనిస్తున్నాం.

-షన్ముఖరావు, వీఏఏ, కేరాశింగి

ఇక రుచికరంగా మెనూ!

(5వ పేజీ తరువాయి) మధ్యాహ్న భోజన పథకం కోసం రూ.12కోట్ల వరకు వ్యయం అవుతోంది. 2,754 ఏజెన్సీలు వంట బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు రుచితో పాటు శుచిగా ఎండీఎంను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రొటీన్లు, పిండిపదార్థాలు సమానంగా అందించే విధంగా మెనూ రూపకల్పన కు కసరత్తు చేస్తుంది.

కొత్త మెనూపై అభిప్రాయాలు ఇవే..

● సాంబార్ బాత్‌ను రెండూ కలిసి కాకుండా వేర్వేరుగా వడ్డించాలి. ● వారంలో ఐదు రోజులు ఇస్తున్న గుడ్డును.. మూడు రోజులు వేపుడు, కూర రూపంలో ఇవ్వాలి. ● రాగి జావలో సుగంధ ద్రవ్యాలు కలపాలి. పచ్చళ్లలో గోంగూర లేదా బీర/ వంకాయిలను కూడా చేర్చాలి. ● వారంలో అన్ని రోజులూ రాగిజావ ఇవ్వకుండా కేక్, లడ్డూలను డ్రైఫూట్స్‌తో కలిపి ఇవ్వాలి. ● సన్నబియ్యం సరఫరా చేయాలి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల పిల్లలకు వంద గ్రాములు, పై తరగతులకు 150 గ్రాముల బియ్యం కేటాయిస్తున్నారు. వీటి పరిమాణం పెంచాలి. ● నిత్యావసరాల ధరల పెరుగుదలకు అనుగుణంగా మార్పు చేయాలి. ● భోజన పదార్థాలను తయారీకి అల్యూమినియం పాత్రలు సమకూర్చాలి. వంట గదులు నిర్మించాలి. వారానికి ఒక రోజు మెనూలో పండు, మజ్జిగ చేర్చాలి.

వారం	పాత మెనూ	కొత్త ప్రతిపాదనలు
సోమ	పొంగల్, కూరగాయలు, ఉడికపెట్టిన గుడ్డు, శెగన చిక్కి	పొంగల్, కూరగాయల పులావ్, గుడ్డుకూర, శెనగ చిక్కి
మంగళ	పులిహోర, టమెటపచ్చడి/ దొండపచ్చడి	అన్నం, పప్పుకూర, వేయించిగుడ్డు రాగి బిస్కెట్ / డ్రైఫ్రూట్
బుధ	కూరగాయల అన్నం, బంగాళదుంప ఉడికించిన గుడ్డు, శనగచిక్కి	వెజ్‌బిర్యానీ, గుడ్డుకూర, శెనగచిక్కి
గురు	సాంబార్ బాత్/ లెమన్ రైస్, టమాట, దొండ పచ్చడి ఉడికించిన గుడ్డు, రాగి జావ	అన్నం, సాంబారు, పచ్చడి (దోస, బీర, టామట, వంకాయి) ఉడికించిన గుడ్డు, శెనగ చిక్కి
శుక్ర	అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించన గుడ్డు, వేరుశెనగ చిక్కి	అన్నం, ఆకుకూరపప్పు, వేయించిన గుడ్డు వేరుశెనగ చిక్కి
శని	అన్నం,ఆకుకూర, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ	అన్నం, వెజ్‌కర్రీ, తీపి పొంగలి / కేసరి



పైడిమాంబ చదురుగుడి వద్ద భక్తుల కోలాహలం

నేడే సిరిమాను సంబరం

● నిర్దేశించిన సమయానికే ప్రారంభమయ్యే అవకాశం
● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
● ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తొలి ఘట్టం అమ్మవారి తొలేళ్ల తంతు పూర్తయింది.. అసలు సంబరానికి వేళ అయింది. కొద్ది గంటల్లో అశేష జనవాహిని అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించే సిరిమానో త్సవం ఆరంభం కానుంది. నడిచే దేవత.. సిరిమాను రూపంలో కనిపించే పైడిమాంబను దర్శించుకునేందుకు ఇప్పటికే లక్షలాది మంది భక్తులు విజయనగరం చేరుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమాను బయలుదేరనుంది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. అమ్మవారి పరివారంగా పిలిచే జాలరి వల, అంజలి రథం, పాల ధార రథాల నిర్వాహకులకు ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు అధికారులు దిశను నిర్దేశించారు. ఆ రథాల వెంట వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉండాలని, నిర్ణయించిన సమయానికి అవి చదురుగుడికి చేరుకోవాలని చెప్పారు. సిరిమానోత్సవంలో పాల్గొనే వారికి ఈ ఏడాది కలెక్టర్ ప్రత్యేకంగా టీషర్ట్స్ అందించ నున్నారు. ఇది వరకు ఎవరికి వారే టీషర్ట్‌లు ధరించి సిరిమాను తిరిగే ప్రాంతాల్లో వందలాదిగా చేరేవారు. దీనివల్ల సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగేది. ఈ ఏడాది అలాకాకుండా అధి కారికంగా టీషర్టులు ఇస్తున్నారు. దీనివల్ల ఇతరులు పాల్గొనే అవకాశం ఉండదు. మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమాను తిరగడం ప్రారంభిస్తే మూడు పర్యాయాలు మూడు లాంతర్ల నుంచి కోట వరకూ వెళ్లి వచ్చేందుకు సమయం దాదాపు రెండు గంటలు పడుతుంది. ఆ విధంగా ఆరు గంటలకు సిరిమానోత్స వాన్ని పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఊరేగింపును కోట బురుజు పైనుంచి పూసపాటి వంశీయులు తిలకిస్తారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ఉన్నతాధికారులు కూడా ఇక్కడి నుంచే వీక్షించే అవకాశం ఉంది. శాసన మండలిలో ప్రతి పక్షనేత బొత్స సత్యనారాయణతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యులు డీసీసీబీ నుంచి సిరిమాను ఊరే గింపును తిలకించే అవకాశం ఉంది. ఎప్పటిలాగే సిరిమానును పూజారి బంటుపల్లి వెంకటరావు అధిరోహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఉద యం 9 గంటల నుంచి 10 గంటల మధ్యలో సమర్పించనున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకనున్నారు.


వజ్రపుకొత్తూరు: పల్లిసారధిలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


పోలాకి: ఉరజాంలో రహదారికి శంకుస్థాపన చేస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: బొమ్మికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


సరుబుజ్జిలి: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు ప్రారంభం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అభివృద్ధే కూటమి ధ్యేయమని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. సోమవారం పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

అభివృద్ధే అజెండా: మంత్రి అచ్చెన్న

టెక్కలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనలో పరుగులు పెట్టిస్తుందని, అభివృద్ధే అజెండాగా ముందుకు నడుస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.రూ.35లక్షల అంచనాతో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి రహదారి, పాతజాతీయ రహదారి, అయ్యప్పనగర్ మీదుగా జాతీయరహదారిని కలుపుతూ రూ.కోటి 82లక్షలతో రోడ్డు పనులు, రూ.కోటి80 లక్షలతో మండాపొలం కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది టెక్కలి మండలంలో 709.49లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కింజరాపు హరిప్రసాద్, బగాది శేషగిరి, ఎంపీపీ సరోజినమ్మ, పీఆర్ ఈఈ సూర్యప్రకాష్, డీఈఈ సుధాకర్, వంశధార ఈఈ శేఖరరావు, ట్రాన్స్‌కో ఈఈ శంకరరావు, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఎల్ఎల్ నాయుడు, చాపరగణపతి, సుందరమ్మ, లవకుమార్, కామేసు, రాము, కింగ్, దోని బుజ్జి, చిన్నమనాయుడు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేస్తాం: శిరీష

వజ్రపుకొత్తూరు,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధిచేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. సోమవారం మండలంలోని పల్లిసారది, చిన డోకులపాడు, ఉద్దానం రామకృష్ణాపురంలో సిమెంట్‌రోడ్డుకు ఆమె భూమిపూజచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పోతనపల్లి షణ్ముఖరావు, అంబటిరామక్రిష్ణ, నాయకులు తామాడ విశ్వనాధం, ఉప్పరపల్లి తిరుపతిరావు, రెయ్యి గణపతి పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో అభివృద్ధి పనులు: మామిడి

పాతపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ప్రతి పంచాయతీలో అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మండలంలోని పెద్దలోగిడి, లాబర, పేదూరు, బొమ్మికలో సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో సమస్యలపై వినతి పత్రాలు అందజేస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కాగా పెద్దలోగిడిలో ఏర్పాటుచేసిన శిలాఫలకంపై ప్రస్తుతం సీతంపేట ఐటీడీఏ పీవోగా యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఉండగా శుభం బన్సల్‌గా, లాబరలో శిలాఫలకంపై ఐటీడీఏ పీవోగా వీవీ రమణ అని రాయడం విశేషం. రెండు చోట్ల వేర్వేరుగా ఉండడంతో గందరగోళం నెలకొంది. లాబరలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించడంతో హడావుడిగా ఎంపీపీ దొర సావిత్రమ్మ, జడ్పీటీసీ లింగాల ఉషారాణి పేర్లను రాయించారు. శిలాఫలకాలపై అధికారులపేర్లు తప్పురాయడం,ప్రోటోకాల్ పాటించకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పైల బాబ్జీ, నాయకులు మద్దు రామారావు, సైలాడ సతీష్, ఎం.బాబూరావు వై.భాస్కరరావు, ఏపీవో సురేష్ పాల్గొన్నారు.

సంక్రాంతికి రోడ్లు సిద్ధంకావాలి: బగ్గు

పోలాకి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రహదారులు సంక్రాంతినాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం కావాలని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు. ఉరజాం, రహిమాన్‌పురం గ్రామాల్లో రహదారి పనులకు శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించాలన్నారు. కార్య క్రమంలో నాయకులు డోలజగన్, బగ్గు అర్చన, తమ్మినాన భూషణరావు, భైరి భాస్కరరావు, కణితిసత్తిబాబు, ఎంవీ నాయుడు, రామకృష్ణ, ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, ఈవోపీఆర్డీ బి.పద్మావతి, ఏపీవో రమణ, ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి కోసమే 'పల్లె పండగ': శంకర్

శ్రీకాకుళం రూరల్/గార, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి కోసమే 'పల్లె పండుగ' కూటమి ప్రభుత్వం చేపట్టిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిష్టప్పపేట, సింగపురం, కరజాడ, భైరి తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మూకళ్ల శ్రీనివాసరావు, జయానంద్, దుంగ శ్రీధర్, ఎంపీడీవో, ఇతర శాఖాల అధికారులు పాల్గొన్నారు. ● గార మండలం ఆరంగిపేటలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గొండు శంకర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పీస వెంకట రమణమూర్తి, బడగల వెంకట అప్పారావు, గుండ భాస్కరరావు, మార్పు దుర్గా పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి పెద్దపీట: ఎన్ఈఆర్

జి.సిగడాం/ రణస్థలం/ ఎచ్చెర్ల/ లావేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. చెట్టుపొదిలాంలో పల్లెపండగ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భూపతి సురేష్, కాయల రమణ, మీసాల వెంకటరమణ, కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, మీసాల రవికుమార్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ శ్రీకాంత్, ఏఈలు శ్రీవల్లి, కుసుమ పాల్గొన్నారు. ● రణస్థలం మండలం మహంతిపాలెంలో వివిధ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ముక్కు ఆదినారాయణ, మైలపల్లి పోలీసు, కలిశెట్టి రామారావు పాల్గొన్నారు.● ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలో నిర్వహించిన పల్లెపండుగలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణహరిహరరావు, కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు పాల్గొన్నారు. ● లావేరు మండలం లోపెంటలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఎన్ఈఆర్ భూమి పూజచేసి పనులను పారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముప్పిడి సురేష్, ఇజ్జాడ శ్రీనివాసరావు, ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి సీసీ రోడ్డే లక్ష్యం: అశోక్

ఇచ్ఛాపురం/కవిటి/కంచిలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కేశుపురం, బూర్జుపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మా ణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, దక్కత ఢిల్లీరావు, సహదేవ్ రెడ్డి, కామేష్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, ప్రసాద్, సోమేష్, దుర్యోదన పాల్గొన్నారు. ● కవిటి మండలం నెలవంక పంచాయతీ పరిధిలోని కొమ్మపుట్టుగ, మధ్యపుట్టుగ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అశోక్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డి.రాజు, ఎంపీడీవో శ్రీని వాసరెడ్డి పాల్గొన్నారు. ● కంచిలి మండలం అంపురం, చిన్న కొజ్జిరియా, పెద్ద కొజ్జి టరియా, జాడుపూడి గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఈశ్వరి, ఈవో ధనుంజయ, కూట మి నాయకులు వి.తిరుమలరావు, బంగారు కురయ్య మాదిన రామారావు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలి: కూన

సరుబుజ్జిలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మర్రిపాడు, సుభద్రాపురం, పెద్ద వెంకటాపురం గ్రామాల్లో సోమవారం 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1.29 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, తాడేల రాజారావు, తర్లాడ


గార: ఆరంగిపేటలో మాట్లాడుతున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


జి.సిగడాం: చెట్టుపొదిలాంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఇచ్ఛాపురం: కేశుపురంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

సిలబస్ రివిజన్ చేయాలి

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సిలబస్‌ను సకాలంలోపూర్తి చేసి రివిజన్ చేయాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. సోమవారం సత్యవరం ఉన్నత పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఎన్‌సీఈ ఆర్‌టీ సిలబస్ అమలులోకి రావడంతో పదో తరగతి విద్యార్థులకు ప్రాక్టీసు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఎండీఎం, నాడు-నేడు పనులు, టీచింగ్‌ప్లాన్ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓకులాదేవి పాల్గొన్నారు.

జీవో-30 అమలు చేయాలి


ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని, జీవో-30, 1174ను తక్షణమే అమలు చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. సోమవారం కాంట్రాక్టు అధ్యాపకుల సంఘ పిలుపు మేరకు నరసన్నపేట జూనియర్ కళాశాలలో విధులకు పసుపు రిబ్బన్లు ధరించి హాజరయ్యారు. అనంతరం ప్రిన్సిపాల్ సత్యనారాయణకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో హనుమంతు ఆనందరావు, మెండ లక్ష్మీనారాయణ, జోస్యుల హరిప్రసాద్, దుగ్గివలస రాంప్రసాద్, కృష్ణవేణి, కొర్రాయి రవి,సురేష్, రూపావతి, స్వర్ణలత, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సత్తాచాటిన హరిపురం విద్యార్థులు

హరిపురం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): హరిపురం ఉన్నతపాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ఇటీవల జరిగిన వివిధ పోటీ పరీక్షలు, క్విజ్ పోటీల్లో సత్తాచాటారని హెచ్‌ఎం జి.ఉమారాజ్ తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు కె.జ్యోషిత, త్రిలోచన, రష్మిత, ప్రణతి, శ్రావ్యాలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తం, స్కూల్ చైర్మన్ కె.సురేష్‌కుమార్,ఎంపీటీసీ మాజీ సభ్యుడు బి.గున్నయ్య, ఉపాధ్యాయులు కోదండరావు, రేణుక, స్వప్న, జగన్మోహనరావు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ...

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట విద్యార్థి అంతర్ జిల్లాల రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల విజయవాడలో జరిగిన 68వ అంతర్ జిల్లాల రెజ్లింగ్ చాంపియన్ పోటీల్లో పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.భాస్కరరావు ద్వితీయస్థానంలో నిలిచి వెండిపతకం సాధించాడు. ఈమేరకు భాస్కరరావుకు ఆ కళాశాల సిబ్బంది అభినందించారు.

రోడ్డుపై రంధ్రం పూడ్చిన పోలీసులు

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ వద్ద జీటీ రోడ్డు ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారి కుంగిపోయి పెద్ద గొయ్యిఏర్పడింది. దీంతో స్థానికులు ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల నుంచి పోలీసులు దృష్టికి వెళ్లింది. దీంతో ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆదేశాలతో హెచ్‌సీ దాలినాయుడు రంధ్రాన్ని పూడ్చారు.

రోడ్లకు నిధుల మంజూరు

పోలాకి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోలాకి మండలంలో ఏడుపనులకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.454.50 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు. సోమవారం పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ చెల్లాయివలస తారురోడ్డుకు రూ.60లక్షలు, సీసీ రోడ్డుకు రూ.25లక్షలు, గొల్లలవలస రహదారికి రూ.120 లక్షలు, చీడివలసకు రూ34లక్షలు, వనితమండలానికి రూ.12లక్షలు, రహిమాన్‌పురం సీసీరోడ్డుకు రూ.36.50లక్షలు, ఉరజాం సీసీ రోడ్డుకు రూ50లక్షలు మంజూరైనట్లు చెప్పారు.

టెట్‌కు 80 మంది గైర్హాజరు

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో జరుగుతున్న టెట్‌కు ఉదయం షిఫ్టులో 330 మంది అభ్యర్థులగాను 295 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 330 మందిగాను 285 మంది పరీక్ష రాశారు. మొత్తం 660 మందికిగాను 80 మంది గైర్హాజరుకాగా 580 మంది పరీక్షలు రాసినట్లు పర్యవేక్షకులు, ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు.

బద్రి కూర్మారావు సన్మానం

పలాసరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : పలాస మండలంలోని రంగోయికి చెందిన రచయిత, గిడుగు రామమూర్తి తెలుగుభాష జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు విజయనగరంలో పైడితల్లి సిరిమానోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన కవిసమ్మేళనంలో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. ఈసందర్భంగా ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాసులో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల గురించి కవిత చదివి వినిపించారు. జానపద సాహిత్యం- సమాజంపై దాని ప్రభావం అన్న అంశంపై వివరించారు.ఈసందర్భంగా ఆయనకు జిల్లా అధికారులు సన్మానించారు. కూర్మారావుకు సన్మానించడంపై కళాసంస్థల సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ

టెక్కలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో 14వ ఆంధ్రాబెటాలియన్ ఆధ్వర్యంలో ఈనెల ఐదు నుంచి 14 వరకు జరిగిన ఎన్‌సీసీ కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (సీఏటీసీ-6) సోమవారం ముగిసింది. శ్రీకాకుళం ఎన్‌సీసీ బెటాలి యన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమర్‌నాథ్‌సాహు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూన్ కుమార్‌పండా, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి,సుబేదార్ మేజర్ సుభాష్‌చంద్, క్యాంప్ కమేండింట్ మేజర్ వి.మహేశ్, అడ్జుటెంట్ కెప్టెన్ వై.పోలినాయుడు, ఐతమ్ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ టి.మురళీమోహన్, కె.రవికుమార్, భుజంగరావు పాల్గొన్నారు.

గట్లు తొలగించక... నీరు వెళ్లక

- ముంపునకు గురవుతున్న పంటపొలాలు
- ఆందోళన చెందుతున్న బీల రైతులు

సోంపేటఅక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సోంపేట పరిధిలోని బీల పంట పొలాల్లో ఎన్‌సీసీ ఏర్పాటుచేసిన గట్లు తొలగించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో మహేంద్ర గిరుల్లో కురిసిన వర్షం నీరు పంట పొలాలను ముంచేస్తోంది.

చేపల చెరువుల నిర్మాణం..

సోంపేటతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో దశాబ్దకాలం కిందట పవర్‌ప్లాంట్ ఎన్‌సీసీ సంస్థ ముందుకొచ్చింది. దీంతో ప్రభుత్వం బీలలో ఎన్‌సీసీ సంస్థకు అనుమతి ఇచ్చింది. అనంతరం సంస్థ ప్రైవేటు వ్యక్తుల నుంచి బీలచుట్టు ఉన్న సుమారు 600 ఎకరాలను కొనుగోలు చేసింది. ఈ క్రమంలో ఇక్కడి ప్రజలు ప్లాంట్ ఏర్పాటుచేయవద్దని ఉద్యమం చేపట్టారు. కాల్పులు జరిగిన తరువాత పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం తీసుకొచ్చిన 1107 జీవోను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థ సేకరించి పొలాల్లో చేపల చెరువుల నిర్మాణానికి పూనుకుంది. దీనికోసం రెవెన్యూ, వ్యవసాయం, మత్స్య, పంచాయతీ తదితర శాఖల అనుమతులు తీసుకోకుండానే కిలోమీటర్ల మేర బీలప్రాంతంలో పెద్దగట్లను నిర్మించింది. అప్పట్లో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. స్వయంగా అప్పటి కలెక్టర్ సైతం చెరువు గట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా నేటికీ అలాగే ఉన్నాయి. ప్రధానంగా మహేంద్రగిరుల్లో కురిసిన వర్షం నీరంతా బీలకు చేరి అక్కడినుంచి సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో బీలకు పైన పెద్ద పెద్ద గట్లు


బీలలో గట్టు తొలగించని దృశ్యం

నిర్మించడంతో నీరు కిందకు వెళ్లకపోవడంతో బెంకిలి, జింకిభద్ర, పలాసపురం, లక్కవరం, బారువ రైతుల పంటపొలాలు ముంపునకు గురవు తున్నాయి. ఏటా చిన్నపాటి వర్షం పడినా పంటపొలాలు మునిగిపోయి పంట పాడవుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా గట్లను తొలగించాలని చుట్టూ ఉన్న గ్రామస్థులు కోరుతున్నారు.

డ్రైనేజీని ఏర్పాటు చేయండి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మురుగునీరు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాసుపత్రి వద్ద మురుగునీరు వెళ్లేందుకు అవసరమైన డ్రైనేజీని ఏర్పాటుచేయాలని ఏపీఎస్ఐడీసీ అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. సోమవారం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిని సందర్శించారు. రోడ్లపై మురుగునీరు రావడంతోపాటు పాకుడేరి ఉండడంతో అసహనం వ్యక్తంచేశారు.మురుగునీరు సరి చేసే బాధ్యత లేదా అని అధికారులకు ప్రశ్నించారు. తొలుత ఆసుపత్రిలో రోగులు కూర్చొనేందుకు ఏర్పాటుచేసిన కుర్చీలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా వైద్యులు కృషి చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావుకు కోరారు. ఆయనతోపాటు ఆర్డీవో కృష్ణమూర్తి, కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషగిరి, లక్ష్మణరావు, బాలకృష్ణ ఉన్నారు.

ప్రభుత్వ విధివిధానాలను అనుసరిస్తాం: ఎంపీడీవో

కోటబొమ్మాళి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):చట్టాలు మా చేతుల్లో లేవని, ప్రభుత్వ విధివిధానాలను అనుసరిస్తామని ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఎంపీపీ రోణంకి ఉమా అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొంతమంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు 23 మంది ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను ఎలా తొలగించారని ప్రశ్నించారు. ఇటీవల ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ అనంతరం ప్రజావేదిక నిర్వహించామని,అవినీతి ఆరోపణలు వెల్లడైన నేపథ్యంలో పీడీ, కలెక్టర్ పరిశీలన అనంతరం 23 మంది క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేశామని ఎంపీడీవో తెలిపారు.సర్పంచ్‌ల తీర్మానం లేకుండా రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు ఎలా వేశారని సభ్యులు ప్రశ్నించారు. దీంతో పంచాయతీరాజ్ జేఈ అజిత్‌కు మార్ సమాధానం ఇస్తూ గ్రామసభలు నిర్వహించి అక్కడ తీర్మానం ప్రాప్తికి కార్యదర్శులు తమకు ఇచ్చిన నివేదిక మేరకు ఉన్నతాధికారులు ఆమోదించి 38 పంచాయతీల్లో 14కోట్ల 90 లక్షలతో 149 పనులు మం జూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దుక్క రోజారాణి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

కోటబొమ్మాళి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యపనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని టెక్కలి డీఎల్‌పీవో గోపిబాల తెలిపారు. కోటబొమ్మాళి రెడ్డికవీధిలో పారిశుధ్య పనులను ఈవోపీఆర్‌డీ జె.అనందరావుతోకలిసి పరిశీలించారు.కార్యక్రమంలో ఈవో సన్యాసిరావు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా హనుమంతరావు

నందిగాం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల సర్వేయర్‌గా జి.హనుమంతరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ మండల సర్వేయర్‌గా పనిచేసిన కంచరాన జోగారావుకు శ్రీకాకుళం ఏడీ కార్యాలయంకు బదిలీ అయ్యింది.

32 టన్నుల పీడీఎఫ్ బియ్యం స్వాధీనం

కొత్తూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లెమ్మ పంచాయతీలోని ఓ రైస్‌మిల్లు నుంచి 640 బస్తాల్లో ఉన్న 32 టన్నుల పీడీఎఫ్ బియ్యం లారీలో ఒడిశా తరలిస్తున్న తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు లారీని కొత్తూరు పోలీస్ స్టేష న్‌కు తరలించారు. ఈఘటనలో బాధ్యులపై కేసు నమోదు చేయాల్సిఉంది.

పేదలకు ఉచితంగా న్యాయసలహాలు

నరసన్నపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయసలహాలు ఇవ్వనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌జైలును ఆయన సందర్శంచారు. ఈ సందర్భంగాఖైదీలకు అందించే భోజనం, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు, న్యాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయంతం చేయండి

కోటబొమ్మాళి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో డిసెంబరు 15న నిర్వహించే లోక్‌అదాలత్‌ను విజయ వంతం చేయాలని మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షురాలు బీఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంద్వారా కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పబ్లిక్ నోటీస్

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇచ్ఛాపురం బ్రాంచి వారి తరఫున ఇవ్వబడుతున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం మండలం, ఇచ్ఛాపురం గ్రామం [illegible]

Schedule: one tiled house bering one door No 2-1-52 those wew also under the Distict Srikakulam, Village- Bellupada @ Ichapuram(103) Ward No.16 of Ichapuram Municipality But due to natural calmaties the entire number of aforesaid muddy Boors in the above premises have been totaly donopished and washes away and as such only the land is left available and the measuring areas of such left land is 1249 Square Yards OR 8,815.5 Square Feet at the at the Northen Row and southern low laying and situated in the District Srikakulam, Mandal-Ichapuram, Pakeeu peta Both side ## 4 previosly known as panchyat board Areas Pakeerupeta, Village- bellupada @ Ichapuram (103) Ward No ;- 16 of Ichapuram Municipality under the state of Andhra Pradesh bearing present Survey no:- 196/3B under post Office and -Police Station Ichapuram, Distict- Srikakulam, Andhra Pradesh -532 312 under village -Bellupada, within the jurisdiction of Joint Registration Office at Ichapuram in the District of Srikakulam, Andhra Pradesh which is butted and Bounded by :- ON THE NORTH:- 16-0 Feet Wide Golla Street road ON THE SOUTH:- 17-0 Feet wide Pakeer peta Road ON THE EAST:- 20'-0 Feet wide public Road, ON THE WEST:- Mahalakshmi-Hospital and House wall of Vajrapu srinivasa rao.

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గార, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అంపోలు గ్రామానికి చెందిన ధర్మాన సూర్యనారాయణ (46) అనే వ్యక్తి పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పనులు చేసుకునే సూర్యనారాయణకు మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించింది. దీంతో మానసికంగా బాధపడిన సూర్యనారాయణ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్టు ఏఎస్‌ఐ టి.చంద్రమోహన్ తెలిపారు. సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్య


భర్త చంటి, భార్య భవానీ (ఫైల్)

లావేరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన నాయిని చంటి శనివారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందగా.. దీనికి తీవ్ర మనస్తాపానికి గురైన అతడి భార్య భవాని ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అప స్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తంగా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం చెందింది. హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మందలించిందని..

● మనస్తాపానికి గురై ఒకరి ఆత్మహత్య

పాతపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాతపట్నంలో సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక బాలాజీ నగర్ మూడో వీధిలో నివాసముంటున్న గోరుశెట్టి శంకరరావు(40) రజకవృత్తితో పాటు నీలమణిదుర్గ ఆలయం వద్ద ఏటలు వేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య, బావ మరిది మందలిస్తుండేవారు. దసరా నేపథ్యంలో ఎక్కువగా మద్యం తాగుతుండడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన శంకరరావు కుమ్మరవీధిలో గల తన తల్లి ఉండే ఇంటికి వెళ్లి అటుకు కర్రకు తువ్వాలు కట్టి మెడకు ఉరివేకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శంకర రావుకు భార్య రాజేశ్వరి, పవన్ తేజ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి స్థానిక సామాజిక ఆసుపత్రిలో శవపంచనామా చేశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. శంకర రావు భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్ఎన్ పేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రావిచెంద్రి జంక్షన్ సమీపంలో అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. హిరమండలం నుంచి ఆర్టీసీ బస్సు సరుబుజ్జిలి వైపు వస్తోంది. అదే సమయంలో సారవకోట మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన తర్ర గురునాథ్ ద్విచక్రవాహనంపై ఎల్ఎన్ పేట మండలం చిన్నకొల్లివలస ఆర్ఆర్ కాలనీలోని అత్తగారి ఇంటికి వస్తున్నాడు. రావిచెంద్రి జంక్షన్ సమీపంలో బస్సును ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో గురునాథ్‌కు గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులు 108 వాహనానికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. స్థానికులు గురునాథ్ అత్తగారి ఇంటికి ఫోన్‌ద్వారా సమాచారం తెలియజేశారు.దీంతో అత్తగారి కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో సిబ్బంది ప్రథమచికిత్స అనంతరం శ్రీకాకుళం తరలించారు.

గడ్డికుప్ప దగ్ధం

టెక్కలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో బి.నారాయణరావుకు చెందిన గడ్డికుప్ప దగ్ధమయ్యింది. అయితే గడ్డికుప్పకు మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలియజేశారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

గుణుపూర్ టు చెన్నై గంజాయి తరలింపు


● నిందితుల నుంచి 18.840 కిలోల స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

పాతపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని గుణుపూర్ నుంచి చెన్నై గంజాయి తరలిస్తుండగా పాతపట్నం చెక్‌పోస్టు వద్ద ఇద్దరు వ్యక్తులు సోమవారం మధ్యాహ్నం పట్టుబడ్డారని శ్రీకాకుళం అడిషినల్ సూపరింటెండెంట్ ఆఫ్‌పోలీస్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో పట్టు బడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నం చెక్‌పోస్టు వద్ద చెన్నైకు చెందిన అజయ్‌కృష్ణమూర్తి, క్రితీష్‌కుమార్ మూటలతో వెళ్తుండగా పోలీసులు తనిఖీ లు చేయగా 18.840 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిద్దరు గంజాయి వినియోగానికి అలవాటుపడ్డారని తెలిపారు.ఈ నేపథ్యంలో చెన్నైకు చెందిన దినేష్ వీరికి ఒడిశాలోని గుణుపూర్ వెళ్లి గంజాయి తీసుకొస్తే చెరో పదివేలు, గంజాయి ఇస్తానని ఆశపెట్టి పంపించినట్లు చెప్పారు. గుణుపూర్ దగ్గరలోని ఓ ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లి గౌతమ్ అనేవ్యక్తి వద్ద 18.840 కేజీల గంజాయిని కొనుగోలుచేసి తిరిగివ్తెండగా పాతపట్నం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారని తెలిపారు. పాతపట్నం సీఐ వి.రామారావు ఎస్ఐ బి.లావణ్యని ఎస్పీ అభినందించారు.

స్వామి భక్తి పోవట్లే..

● రేషన్ వాహనంపై తొలగించని మాజీ సీఎం జగన్ ఫొటోలు


ఎండీయూ వాహనంపై మాజీ సీఎం జగన్ ఫొటోలు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చాప చుట్టేసినా కొంత మంది ఎండీయూ ఆపరేటర్లు మాత్రం తమ స్వామి భక్తిని ప్రదర్శిస్తునే ఉన్నారు. ప్రభుత్వం మారి 100 రోజులు దాటినా రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాలపై మాత్రం జగన్ చిత్రాలు ఇంకా తొలగించకపోవడం కొసమెరుపు. ఇటీవల ఎల్ఎన్ పేట మండలం యమరాం గ్రామంలో ఇటువంటి ఘటన చోటుచేసుకోగా.. ఇప్పుడు శ్రీకాకుళం నగరానికి సమీపంలో ఉన్న పెద్దపాడు గ్రామంలో గల ఎండీయూ వాహనంపై ఇంకా జగన్‌రెడ్డి ఫొటోలతోనే రేషన్ పంపిణీ చేస్తుండడం విశేషం. నిత్యమూ రాజకీయ నాయకులు, జిల్లా అధికారులు తిరిగే ఈ రోడ్డు మార్గంలో ఎండీయూ వాహనంపై ఇటువంటి చిత్రాలు దర్శనమిస్తున్న అధికారులు పట్టించుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

శివారుకు అందని సాగునీరు

● ఎండిపోతున్న పంటలు
● ఆందోళనలో రైతులు
● ఇదీ నారాయణపురం కుడి కాలువ దుస్థితి


నవభారత్ జంక్షన్ వద్ద నారాయణపురం కుడి కాలువ దుస్థితి


పొన్నాడ పరిసరాల్లో ఎండిపోతున్న వరి పంట

ఎచ్చెర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నారాయణపురం కుడి కాలువ కింద ఉన్న ఎచ్చెర్ల మండలంలోని శివారు గ్రామాల ఆయకట్టుకు సాగునీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆడపాదడపా వర్షాలు కురుస్తున్నా.. ఈ ఏడాది కాలువ ద్వారా సాగునీరు సరఫరాలో ఆటంకాలు ఏర్పడడంతో రైతులు దిగులు చెందుతున్నారు. నారాయణపురం కుడి కాలువ కింద ఎచ్చెర్ల మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. కాలువలో పూడికలు పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. జైకా నిధులతో ప్రారంభించిన నారాయణపురం ఆధునికీకరణ పనులు నత్తనడకగా సాగడంతో రైతుల కష్టాలు గట్టెక్కలేదు. కాలువ ద్వారా సాగునీరు పూర్తిగా ముందుకు సాగకపోవడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. నవభారత్ జంక్షన్ వద్ద సాగునీటి కాలువను పరిశీలిస్తే పూర్తిగా అడుగంటిపోయింది. దీంతో సాగునీరు శివారు గ్రామాల పొలాలకు చేరడంలేదు. అలాగే వరి చేలు కూడా ఎండిపోతున్నాయి. కాలువ ద్వారా సాగునీరు విడుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే రెండు, మూడుసార్లు కాలువ దుస్థితిని జిల్లా అధికారుల దృష్టికి ఆయకట్టు రైతులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. దీనిపై ఏఈ జీవీ రమణతో ప్రస్తావించగా.. నీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శాలిహుండాం ఆక్రమణ భూమి పరిశీలన

● అధికారులకు ట్రస్టు చైర్మన్ ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఆక్రమణ భూమిని పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

పొందూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అంబేడ్కర్ కూడలి సమీపంలో సర్వే నెంబరు 198లో శాలిహుండాం వేణుగోపాలస్వామి ఆలయం ట్రస్టుకు సంబంధించిన భూమిలో ఆక్రమణలను ట్రస్టు చైర్మన్ మధురెడ్డి, దేవదాయశాఖ అధికారులు ప్రసాదబాబు, దుర్గాప్రసాద్ సోమవారం పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'శాలిహుండాం ట్రస్టుభూమి ఆక్రమణ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ భూమిలో నందల వ్యాపారం చేస్తున్న కె.భూలోకను నాలుగు రోజుల్లో ఖాళీచేయాలని ఆదేశించారు. ఎటువంటి అనుమతి లేకుండా ట్రస్టు భూమిలో ఉన్న నిర్మాణానికి విద్యుత్ మీటర్‌కు ఇచ్చిన ఎన్‌వోసీని రద్దు చేయాలని పంచాయతీ ఈవో మోహన్ బాబుకు వినతిపత్రం ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లకు, ఏఎస్ఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. త్వరలోను ట్రస్టు భూమిని ఆక్రమించినవారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని ట్రస్టు చైర్మన్ మధురెడ్డి తెలిపారు.

హెల్త్ సెక్రటరీలను వైద్యశాఖకు బదలాయించండి

అరసవల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలను డీడీవో అధికారాలతో సహా వైద్యారోగ్యశాఖకు బదలాయించాలని ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఉషా) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సోమవారం ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియార్టీ లిస్టులు తయారు చేసి, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లుగా పదోన్నతులు కల్పించాలని, ఎటువంటి పైరవీలకు అవకాశం ఇవ్వరాదన్నారు. వైద్యారోగ్యశాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలి, మెటర్నిటీ లీవును డెలివరీ తేదీ నుంచి కాకుండా, అప్లై చేసిన తేదీ నుంచి మంజూరు చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్తల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం ట్రెజరీ వారికి ఆదేశాలు జారీ చేయాలి, యూనిఫాం అలవెన్సు అందించాలని, 115 జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.సాయిప్రసాద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటలక్ష్మి, డీఎంహెచ్‌వో, కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాధిక, ఎ.రాజ్యం, మెర్సీ, విశాలాక్షి, దమయంతి, లక్ష్మి తులసి తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నక్యాంటీన్ ప్రారంభం

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిర్మించిన అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించనున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని తెలిపారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొనసాగుతోంది. సోమవారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 184 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు 21వ తేదీ వరకు కొనసాగుతాయి.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసిద్ధి చెందిన మహతి కళాక్షేత్రంలో వెంకటేశ్వర డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీకి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి అశ్వవాహన సేవలో కూడా మరో చక్కటి అవకాశాన్ని టీటీడీ యాజమాన్యం అందించారు. శ్రీవారి మాడవీధుల్లో చిన్నారుల మువ్వల సవ్వడులు ఎంతగానో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులను నాట్యాచార్య ఏలేశ్వరపు శ్రీనివాసులు (అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు యూనివర్సిటీ కూచిపూడి గ్రామం) అభినందించారు. కార్యక్రమంలో చిన్నారులతో పాటు అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి, నాట్య గురువు శృతి పట్నాయక్‌ను అభినందించి మెమోంటోలు అందజేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను ఆదుకోవాలి


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్

కంచిలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిలిచిన పోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, జీవో నెం. 114 అమలు చేయాలని కోరుతూ వినూత్నంగా పసుపు రిబ్బన్లతో నిరసన తెలుపుతూ కాంట్రాక్ట్ లెక్చరర్స్ విధులకు హాజరయ్యారు. పసుపు రిబ్బన్లతో విధులకు హాజరైన లెక్చరర్స్ ఈ నెల 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు వెళ్లనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పసుపు రిబ్బన్లతో నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించి ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లందరికీ క్రమబ ద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 నాటికి ఆర్థిక వృద్ధిరేటు పెంచే దిశగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం స్వర్ణాంధ్ర-2047పై మండల, జిల్లాల విజన్ ప్లానింగ్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అత్యధికంగా సూచనలు వచ్చాయని, 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ఏక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఇప్పటికే మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసామని, పెద్ద ఎత్తున ప్రజల సూచనలను తీసుకున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.అప్పారావు, ఆర్డీ వోలు కె.సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం విజయరత్నం, డీడీ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ పీడీ నగేష్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, డీపీవో కె.భారతి సౌజన్య తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సోలార్ పై అవగాహన

ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు విద్యుత్ కోసం పెట్టే వ్యయం తగ్గుతుందని అందుకు ప్రతీ ఒక్కరూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ గోవిందరావు పిలుపునిచ్చారు. సోమవారం తాహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించి అందరికీ సౌరశక్తి వివరించారు. ఎంత విద్యుత్ అవసరమైతే ఆ మేరకే సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవచ్చునని, రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలు ఎంతో విలువైనవి

పొందూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణ ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి నూతన ఆలయం నిర్మాణంలో దివంగత అనకాపల్లి అక్కలనాయుడు సేవలు మరువలేనివని యంగస్టార్స్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ మండల కన్వీనర్ కె.శాంతారాం అన్నారు. పైడితల్లి ఆలయం వద్ద అక్కలనాయుడు ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కలనాయుడు కుమారుడు శివకుమార్ పట్టణవాసులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించిన మాజీ మంత్రి


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

బూర్జ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మదనాపురం జంక్షన్ వద్దపాతపాడు శివదుర్గమ్మ అమ్మవారిని అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గుడిని గతంలో దర్శించుకోవడం వల్ల తాను మంత్రి అయ్యానన్న నమ్మకం ఉందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.కోటేశ్వరరావు, కర్నేన అప్పలనాయుడు, సాయికుమార్, ఆర్బ్ సంస్థ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమండ్రిలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన 70 మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో 11 బంగారు పతకాలు, 11 రజితాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది మంది సౌత్‌జోన్ నేషనల్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఈ నెల 16వ తేదీన 8 గంటలకు గుంటూరులో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీకు హాజరు కావాలని జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలియజేశారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ఎన్.విజయ్‌కుమార్, ప్రతినిధులు కొన్న వెంకటేశ్వరరావు, బీవీ రమణ, కె.మాధవరావు, కె.హరిబాబు, టి.శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

ఎంపికైన వారు వీరే

వి.రాజేష్ (400 మీటర్ల పరుగు) టి.తరుణ్ (జావెలిన్ త్రో), బి.హారిక (100 మీటర్ల పరుగు), మౌనిక మిశ్ర (జావలిన్ త్రో), పి.యశ్విత (హైజంప్), జి.అభిరామ్ (పెంటాథిలిన్)లు జట్టులో ఉన్నారు.

నష్టపరిహారం ఇప్పించి ఆదుకోండి


సమస్య వివరిస్తున్న గ్రామస్థులు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయిన తమకు పరిహారం అందలేదని, ఇప్పటికైనా తమకు అందించి కుటుంబాలను ఆదుకోవాలని సోమవారం మీకోసంలో బాధితులు కోరారు. ఈ మేరకు రణస్థలం మండలం, కోటపాలెం గ్రామానికి చెందిన రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసంలో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు.

వివరాలు సరిచూసుకోవాలి

సోంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఖరీఫ్ 2024కు సంబంధించి ఉద్యాన పంటల వారీగా వివరాలు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించినట్టు ఏవో బి.నర్సింహమూర్తి తెలిపారు. రైతులు పరిశీలించి సవరణలు ఉంటే వీఏఏల దృష్టికి తీసుకురావాలన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ పంట డ్రాఫ్టలిస్ట్ ప్రతీ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ అధికారిణి టి.భార్గవి తెలిపారు. సోమవారం తేలుకుంచి ఆర్ఎస్‌కేలో ప్రదర్శించారు. ఏమైన తప్పు, ఒప్పులు ఉంటే ఆర్ఎస్‌కేలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు అందజేయాలని సూచించారు. సమస్యలుంటే తక్షణమే పరిష్కరించుకోవాలన్నారు.

ప్రజా ఫిర్యాదులపై చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇచ్చి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు నమోదు, పరిష్కర వేదికలో ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ల ఇన్‌చార్జీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రజాఫిర్యాదులపై సకాలంలో దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కాగా మొత్తం 50వినతులు స్వీకరించారు. కుటుంబ తగాదాలపై ఎనిమిది, చీటింగ్‌పై రెండు, సివిల్, ఆస్తి తగాదాలపై14, ఇతర అంశాలపై12, పాత కేసులపై 14 వినతులు అందాయి.

వలస మత్స్యకారులకు న్యాయం చేయాలి

సోంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లో ఉన్న వలస మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ సంఘ నాయకులు కోనేట వెంకటరావు, సీహెచ్ లోకేష్, జి.రామారావు తదితరులు కోరారు. ఏడాదిలో వివిధ సమస్యల వల్ల కేవలంలో నాలుగు నెలలు మాత్రమే వేట సాగించే పరిస్థితి ఉండడంతో చాలామంది మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారన్నారు. తుఫాన్ సమయంలో రోజుకు రూ.500 ప్రతీ మత్స్యకార కుటుంబానికి అందించాలన్నారు.

ఆధ్యాత్మికతోనే సేవాభావం

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషిలో ఆధ్యాత్మిక చింతన ఉన్నప్పుడే మనుషుల మధ్య స్నేహభావం, సేవాభావం అలవడుతాయని రిటైర్డు డీఎస్పీ, హైకోర్టు న్యాయవాది శమళ్ల వెంకట వర ప్రసాదరావు అన్నారు. దేవీ నవరాత్రులు పురస్కరించుకొని నగరంలోని విశాఖ-బీ కాలనీ షిర్డీసాయి ఆలయంలో నిర్వహించిన నారాయణ సేవాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషిలో భక్తిభావం ఉండడం వల్ల మానసిక పరివర్తన వ్యక్తి వికాసం చెందవచ్చునన్నారు. కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ, విష్ణు పారాయణ, సత్సంగ యోగా సభ్యులు, విశాఖ-బీ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు ఆదా

ఆమదాలవలస, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య యోజన పథకంలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొనే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈఈ బి.రవి కుమార్ అన్నారు. ఆమదాలవలస రూరల్ సెక్షన్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ యువజన పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సొంత ఇళ్లు కలిగిన వారు సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుంటే ఎంతో లాభమన్నారు. తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. ఏఈ రవికుమార్, జేఈ రఘు, సబ్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

జూట్ కార్మికుడు మృతి

జి.సిగడాం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం గ్రామ సమీపంలో ఉన్న ఓ జూట్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుడు సత్యేంద్రసింగ్ (55) సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చత్తీస్‌గడ్ రాష్ట్రం రాయపూర్ గ్రామానికి చెందిన సత్యేంద్రసింగ్ రెండు నెలల కిందట జూట్ మిల్లులో కార్మికుడుగా చేరాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భోజనం చేసి విశ్రాంతి భవనంలో నిద్రిస్తుండగా నిద్రలోనే మృతి చెందాడు. జూట్‌మిల్లు యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. సత్యేంద్ర సింగ్ వద్ద ఉన్న ఆధార్ కార్డులో ఉన్న అడ్రాస్ అధారంగా మృతి చెందిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.